భానుడి భగభగ

- మార్చి నెలాఖరుకు 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- పల్నాడు ప్రాంతంపై తీవ్ర ప్రభావం
- మధ్యాహ్నంకు ఖాళీ అవుతున్న రోడ్లు
- కూలీలకు తప్పని ఎండ పాట్లు
- వడ దెబ్బకు గురయ్యే ప్రమాదం
- జాగ్రత్తలు సూచిస్తున్న వైద్యులు





దాచేపల్లిలో ఎండ ధాటికి రద్దీ తగ్గిన బంగ్లా సెంటర్

గురజాల/దాచేపల్లి : పల్నాడులో భానుడి ప్రతాపం ప్రారంభమైంది. ఎండలంటే మొదట గుర్తొచ్చే ఈ ప్రాంతంలో మధ్యాహ్నం నాటికి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మే నెల మొదలు కాకముందే.. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 11 గంటల నుంచే రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ వేడికి కూలి పనులు చేసుకునేవారు ఇబ్బందులు పడుతున్నారు. తలకు తుండు, టవల్, టోపీ వంటివి పెట్టుకోకుండా బయటకు రావడం లేదు. ఈ క్రమంలో వృద్ధులు, చిన్నారులు, మహిళలు అనారోగ్య సమస్యలు, వడదెబ్బబారిన పడే అవకాశాలున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా చర్యలు

ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో బీపీ, షుగర్ వంటి అనారోగ్య సమస్యలు ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండలో ప్రయాణించడం అంత మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. ఎవరైనా వడదెబ్బకు గురైనట్లు గుర్తిస్తే ఆ వ్యక్తిని నీడ, గాలి తగిలే ప్రదేశంలో ఉంచాలని చెబుతున్నారు. చల్లని నీటిని తాగించి, నీటితో ముఖం శుభ్రం చేసి వెంటనే దగ్గరలోని వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. ఎండలో ప్రయాణించేప్పుడు టోపీ, కండువా వస్త్రాలు కప్పుకుని వెళ్లాలని, మాంసాహారం పూర్తిగా తగ్గించాలని, మజ్జిగ, మంచినీళ్లు ఎక్కువ మోతాదులో తీసుకుంటే బాగుంటుందని జాగ్రత్తలు చెబుతున్నారు.

వడదెబ్బ లక్షణాలు

- శరీరంలో ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోవడం.
- చెమట పట్టకపోవడం, వణుకు పుట్టడం.
- పాక్షికంగా ఫిట్స్ రావడం. అపస్మారక స్థితిలోకి వెళ్లడం.
- మగత నిద్ర రావడం, కలవరింతలు పలకడం.
- పెదవులు ఎండిపోయి నోరు పిడచ కట్టుకుపోవడం.

ఇలా స్వీయరక్షణ పొందుదాం

- ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటే బయటకు వెళ్లకుండా ఉండడం.
- తప్పనిసరి వెళ్లాల్సి వస్తే టోపీ, గొడుగు, రుమాలు ధరించాలి.
- ఇంటి కిటికీలు తెరచి ఉంచి, గాలి, వెలుతురు తగిలేలా చూసుకోవాలి.
- రోజుకి కనీసం 15 గ్లాసుల మంచినీరు తాగాలి, మితంగా భోజనం చేయాలి.
- కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, పళ్ల రసాలు తీసుకోవాలి.
- రెండు పూటలా స్నానం చేయాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి.
- లేతరంగు కలిగిన తేలికగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- మాంసహార పదార్థాలు తీసుకోవడం తగ్గించి, మద్యానికి దూరంగా ఉండాలి.
- అలసట అని భావిస్తే సాధ్యమైనంత త్వరగా చల్లటి ప్రదేశానికి వెళ్లాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



వడదెబ్బ తగలకుండా వృద్ధులు, చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ తగిలినట్లు అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రతి ఒక్కరూ వైద్యుల సలహాలు తీసుకోవాలి.

– సాయి కర్ణ యాదవ్, వైద్యుడు, గురజాల

ప్రథమ చికిత్స తప్పనిసరి



వడదెబ్బ తగిలిన వ్యక్తిని తక్షణమే నీడ ప్రదేశానికి చేర్చి, గాలి తగిలేలా చూడాలి. శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకు మెత్తడి తడిగుడ్డతో తుడవాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన గ్లూకోజ్ తాగించాలి. అపస్మారక స్థితికి వెళ్లిన రోగికి నీరు తాగించకూడదు.

– డాక్టర్ పి.సుచరిత, పీహెచ్‌సీ, దాచేపల్లి

క్లుప్తంగా

పోలేరమ్మ తల్లి తిరునాళ్ల



గురజాల రూరల్ : మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో పోలేరమ్మ తిరునాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. తిరునాళ్లను పురస్కరించుకుని భక్తులు వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తులకు దేవాలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. పోలేరమ్మను వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ, నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ఉగాది సంబరాలు

గురజాల : తెలుగు సంవత్సరాది ఉగాది పండగ సంబరాలు నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంప్రదాయబద్ధంగా దుస్తులు ధరించి, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పట్టణంలోని సీతారామాలయంలో అర్చకుడు పిన్నెల్లి వెంకట సుబ్రమణ్యం పంచాంగ శ్రవణం చేశారు. దేవాలయాల్లో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

దాహార్తిని తీర్చడం అభినందనీయం



రెంటచింతల: మండల కేంద్రంలో రమణ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుకుడు నవులూరి శివారెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల బీజేపీ అధ్యక్షుడు బోయ నాగిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక దేశ స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల విగ్రహాల వద్ద ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నవులూరి శివారెడ్డిని యువత ఆదర్శంగా తీసుకుని గ్రామాలలో చలివేంద్రాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. బీజేపీ మండల ఉపాధ్యక్షులు సురేష్ బాబు, షబ్బీర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం



దాచేపల్లి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై విచారణ చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్ అన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపట్ల కేసానుపల్లి లూథరన్ చర్చిలో ఆదివారం సంతాప ప్రార్థన నిర్వహించారు. ఐదు నిమిషాలు మౌనం పాటించారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ..పాస్టర్ ప్రవీణ్ మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటు అని అన్నారు. ఆయన మృతిపై క్రైస్తవులకు ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

జాస్తి వీరాంజనేయులుకు ఉగాది పురస్కారం

అమరావతి: అమరావతి మండల పరిధిలోని పెదమద్దూరు గ్రామానికి చెందిన జాస్తి వీరాంజనేయులుకు ఉగాది పురస్కారం లభించటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడిగా సామాజిక సేవా రంగంలో ఉన్నతమైన సేవలను అందిస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు నందిస్తున్న వీరాంజనేయులుకు ఈ పురస్కారం లభించటంపై పెదమద్దూరు గ్రామస్తులు, మండల పరిధిలోని పలువురు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ పురస్కారం రావటం ఆనందంగా ఉందని భవిష్యత్‌లో కూడా సామాజిక సేవా రంగంలో తన సేవలు కొనసాగిస్తానని తెలిపారు.

లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

సత్తెనపల్లి: సమస్యలు వచ్చినప్పుడు కుంగిపోకుండా లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలని ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది చిలుకా చంద్రశేఖర్ అన్నారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని సత్తెనపల్లికి చెందిన మాజీ కౌన్సిలర్ ఉల్లం ఝాన్సీలక్ష్మీభాయ్ తన తండ్రి సత్యనారాయణ స్మృత్యర్థం బీ.ఫార్మసీ విద్యార్థిని గంటా సుజితకు ఆదివారం ల్యాప్‌టాప్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్ని ఆటు పోట్లు ఎదురైనా విద్యను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. విద్య ద్వారానే గౌరవ మర్యాదలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా బీ.ఫార్మసీ విద్యార్థిని గంటా సుజితకు ల్యాప్‌టాప్ అందించి అభినందించారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది ఉల్లం శేషగిరిరావు, పుచ్చకాయల సత్యవతి తదితరులు ఉన్నారు.

కృష్ణమాచార్యులకు అభినందనలు



కృష్ణమాచార్యులను అభినందిస్తున్న ఈఓ రామిరెడ్డి తదితరులు

రెంటచింతల: ఎన్నో ఎళ్లుగా అర్చకులుగా అర్చక సేవా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులకు గుర్తింపే అర్చక పురస్కారం అని ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి అన్నారు. ఉగాది వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు కృష్ణదేవరాయలు చేతుల మీదుగా కృష్ణమాచార్యులు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వద్దమాను రమణాచార్యులు, చిట్టేల శివశర్మ, మల్లికార్జునశర్మ, వెల్లటూరి నాగేశ్వరశర్మ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు యగ్న నారాయణ, ఎస్. శ్రీనివాసమూర్తి, నాగేండ్ల వెంకటేశ్వర్లు, వెన్నా వెంకటేశ్వరరెడ్డి అభినందించారు.

పుల్లారెడ్డి మృతికి కాసు మహేష్‌రెడ్డి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు మద్దసాని పెదపుల్లారెడ్డి(72) మృతికి మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నివాళులర్పించారు. ఆదివారం మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కరాలపాడు గ్రామానికి చెందిన పుల్లారెడ్డి వైఎస్సార్ సీపీ అభివృద్ధికి తన వంతు కృషి చేసినట్లు మహేష్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర వైద్యులు విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, గ్రామ సర్పంచ్ చల్లా శివారెడ్డి, యల్లారెడ్డి, నాయకులున్నారు.

భక్తిశ్రద్ధలతో పేరంటాలమ్మతల్లి తిరునాళ్ల



పేరంటాలమ్మతల్లి



వాసవీక్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు వేపపూత ప్రసాదం పంపిణీ

- పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్న భక్తులు
- పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు

అచ్చంపేట: ఉగాది మహోత్సవాలలో భాగంగా స్థానిక అచ్చమ్మ పేరంటాలమ్మతల్లి దేవాలయంలో తిరునాళ్ల మహోత్సవాలు మూడవరోజు ఉగాది నాడు వైభవంగా జరిగాయి. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయం వద్ద పొంగళ్లు పొంగించుకుని అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు కూరపాటి మల్లిఖార్జునరావు, రామకిరణ్‌గార్లచే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా విభాగం లలిత సహస్ర నామ పారాయణ, భజన కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారికి కర్పూర హారతులిచ్చారు. దేవాలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు సురే సుబ్బారావు ఆధ్వర్యంలో వేపపూత ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

ఉగాది ఉత్సవాలలో భాగంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు స్థానిక ఆంజనేయస్వామి విగ్రహం వద్ద శ్రీవాసవీ క్లబ్ వారిచే వేపపూత ప్రసాద పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వాసవీ క్లబ్ సభ్యులంతా సేవా దృక్పథంతో పని చేయాలని క్లబ్ రాష్ట్ర ప్రముఖులు సూరే వెంకటకోటిలింగం తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రముఖులు అడ్డగిరి వెంకటసాయి పార్థసారథి, అనుముల శేషగిరి, కొప్పరావూరి మురళీకృష్ణ, ఏలూరి శ్రీనివాసరావు, భవిరిశెట్టి రవికుమారు, వీరవల్లి శ్రీనివాసరావు, బుల్లె నరసింహారావు, వాసవీ వనిత అధ్యక్షులు పులిపాటి పద్మ, అన్నవరపు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

గడియార స్తంభం వద్ద ఆర్యవైశ్యుల నిరసన



సత్తెనపల్లి: పట్టణంలోని గడియార స్తంభం అన్యమత ప్రచార స్తంభంలా మారిందని ఆవోపా పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో ల్యాండ్ మార్క్‌గా ఏర్పాటు చేసిన గడియార స్తంభం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆదివారం గడియార స్తంభం వద్ద ఆర్యవైశ్య నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గడియార స్తంభం వద్ద ఎలాంటి అన్యమత ప్రచారాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలు, గోశాల అధ్యక్షుడు పెండ్యాల కాశీమల్లేశ్వరరావు, యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్, కమిటీ సభ్యులు భవిరిశెట్టి రంజిత్ కుమార్, లఘువరపు రమేష్, కటుకం చంద్ర, చిలకల వాసు, కనమర్లపూడి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

వైద్యశాలలో అన్నదానం

సత్తెనపల్లి: నిరుపేదలను ఆదుకోవటమే నిజమైన పండుగ అని బీజేపీ సీనియర్ నాయకుడు పులిపాటి శ్రీరామమూర్తి అన్నారు. స్వచ్ఛంద పదవి విరమణ చేసిన ఎలక్ట్రికల్ ఏడీఈ బత్తుల శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఆదివారం 120 మంది నిరుపేద రోగులు, వారి సహాయకులకు జనసేన పార్టీ నాయకుడు అప్పాపురం నరేంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పథకంలో ఉగాది సందర్భంగా ఆదివారం అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నిరుపేదల ఆకలి తీర్చేందుకు సహకరించిన బత్తుల శ్రీనివాసరావు, వారి కుమారుడు బత్తుల దినేష్ కృష్ణకు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూరే రామకోటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, చేపూరి నాగేశ్వరరావు, కట్టమూరు అప్పారావు, కుంచన పల్లి శ్రీనివాసరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని కోటబజార్ పులుపుల వారి వీధిలోని శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పలువురు భక్తులు విరాళాలను అందించారు. పట్టణానికి చెందిన అర్వపల్లి హరివిజయకుమార్, రామ్‌ప్రతాప్‌కుమార్‌లు రూ. 2,01,116, కొత్తూరి శ్రావణ్‌కుమార్, నాగలక్ష్మీ దంపతులు రూ.1,00,116, పులిపాటి వెంకటేశ్వర రుక్మాంగదరావు, వెంకట అనూరాధ దంపతులు రూ.1,01,116, చలువాది వెంకట అయ్యప్ప పృథ్వీరాజ్ గుప్త, మౌనిక దంపతులు రూ.51,116 విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వనమా కృష్ణ, కోవూరి శివశ్రీనుబాబు, వనమా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు క్రోసూరు ఎస్ఐ

క్రోసూరు: క్రోసూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నాగేంద్రరావును వీఆర్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు నుంచి ఆదేశాలొచ్చినట్లు సీఐ పి.సురేష్ ఆదివారం తెలిపారు. ఎన్నికల తరువాత జరిగిన సాధారణ బదిలీల్లో ఎస్ఐ క్రోసూరుకు వచ్చారు. ప్రస్తుతం వీఆర్‌కు పంపిన కారణాలు తెలియరాలేదు. ఇంకా ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదని తెలిసింది.

ఘనంగా ఉగాది వేడుకలు



పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు



ప్రత్యేక అలంకరణలో పంచముఖ ఆంజనేయస్వామి

మాచవరం: విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. పాడి, పంటలు, సుఖ, సౌభాగ్యాలతో చల్లగా దీవించాలని దేవుళ్లను వేడుకున్నారు. రైతులు ఎద్దులను, అరకలను ప్రత్యేకంగా అలంకరించి ఏరువాక కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన దేవాలయాల వద్ద ఆలయ పూజారులు, బ్రాహ్మణ పండితులు పంచాంగ శ్రవణం గావించారు.

షడ్రుచులులా..జీవితంలో కష్టనష్టాలు

పిడుగురాళ్ల: ఉగాది పండగను ప్రజలు ఘనంగా ఆదివారం నిర్వహించుకున్నారు. దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. షడ్రుచులు మాదిరిగానే తమ జీవితాల్లో కష్టసుఖాలను ఎదుర్కొని నిలబడాలని ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. పలు దేవాయాల్లో ప్రత్యేకంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు గావించారు. సాయంత్రం పండితులు పంచాగ శ్రవణం గావించారు. ఉగాది పర్వదినాన్ని బంధువులు, స్నేహితులతో కుటుంబ సభ్యులతో ఘనంగా జరుపుకున్నారు.

ఉగాది పూజలు

మాచర్ల: పట్టణంలో ఉగాది పండగ సందర్భంగా తెల్లవారుజాము నుంచే పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి, పాతూరులోని శ్రీలక్ష్మీ చెన్నకేశ్వరస్వామి దేవాలయాలు, వాసవి కన్యకాపరమేశ్వరి, పాతూరు శివాలయం మాతా అన్నపూర్ణేశ్వరిదేవి, అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఆయా కమిటీలు, అర్చకుల ఆధ్వర్యంలో మూలవి రాట్‌లను ఘనంగా అలంకరించి, పూజలు చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారి వద్దనున్న కోదండరామస్వామి, లక్ష్మీచెన్నకేశ్వరస్వామి దేవాలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆయా దేవాలయాల్లో పూజల్లో పాల్గొని, పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు.

కళాకారులకు సత్కారం



సత్కారం అందుకున్న కళాకారులతో ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య

సత్తెనపల్లి: కళలను నైపుణ్యంతో చురుగ్గా ప్రదర్శించే వారే కళాకారులని ఉషోదయ కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య అన్నారు. విశ్వావసు నామ తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఉషోదయ కళాపరిషత్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో, వివిధ కళల్లో నైపుణ్యం సంపాదించిన కళాకారులు ఎలిశెట్టి వెంకటప్రసాద్, శిఖా ఆదాం, మండ్ల నరసింహ ప్రసాద్‌లను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా పాములయ్య మాట్లాడుతూ కళాకారుల ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా ముగ్గురు కళాకారులను పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కుమ్మరి దస్తగిరి, కళాకారులు మాతంగి సాంబశివరావు, బత్తినేని వెంకట లక్ష్మయ్య, డాక్టర్ సరికొండ రమాదేవి, పొత్తూరి రామకోటయ్య, పిలుట్ల ఆంజనేయులు, సిరిగిరి వెంకట్రావు, తమలపాకుల రవి కిషోర్, కాటుమాల నాగేశ్వరరావు, గుండవరపు అమర్‌నాథ్, గుంటూరు గోవింద్, చింతా అంకమ్మరావు, పిక్కల రత్తయ్య, విప్పర్ల కొండలు, పిక్కిలి శివ తదితరులు ఉన్నారు.

అక్షయపాత్ర వంట గదికి శంకుస్థాపన

నరసరావుపేట రూరల్: అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించే కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. మండలంలోని కేసానుపల్లి సమీపంలో కేంద్రీకృత వంటగది నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, అక్షయపాత్ర ప్రాంతీయ అధ్యక్షుడు వంశీధర దాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఈ ప్రాంతానికి అక్షయపాత్రను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పరిశుభ్రమైన పోషకాహారం మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అందుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఐదువేల మందికి భోజనాన్ని అందించేలా కిచెన్ నిర్మితం కానుందన్నారు. విస్తరణకు దాతలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎంఎం కళాశాల అధ్యక్షుడు ఎంవీ శేషగిరిరావు, నల్లపాటి రామచంద్రప్రసాద్, కపలవాయి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన ఆహార సలహా కమిటీలు

- రేషన్ దుకాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- సరుకుల పంపిణీలో అవకతవకలు



తహసీల్దార్ కార్యాలయం

గురజాల: రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, నిరుపేదలకు నిత్యావసరాలు అందే విధంగా పర్యవేక్షించే ఆహార సలహా సంఘ సభ్యులు నేడు కనిపించడం లేదు. ప్రస్తుతం ఈ సంఘాల ఉనికి లేకపోవడంతో పర్యవేక్షణ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో తూకాలలో మోసాలు జరుగుతున్నాయి. అదేవిధంగా లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆహార సలహా కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహిస్తుంది. మండల స్థాయిలో ఉన్న రేషన్ దుకాణాల నిర్వహణపై సమీక్షిస్తుంది. ప్రస్తుతం అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. గురజాల నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 201 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదేవిధంగా 1,02,063కి పైగా రేషన్ కార్డులున్నాయి. ఆహార సలహా కమిటీ చైర్మన్‌గా మండల స్థాయిలో తహసీల్దార్, జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వ్యవహరించేవారు. సభ్యులుగా ఎంపీడీవో, జెడ్పీటీసీ సభ్యులు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మీటింగ్ ఏర్పాటుచేసి సక్రమంగా నిత్యవసర వస్తువులు అందుతున్నాయా లేదా అని సమీక్షించేవారు. నేడు మాత్రం అందుకు భిన్నంగా ఉందనే చెప్పవచ్చు.

గురజాలలో రేషన్ వివరాలు..

మండలం	రేషన్ దుకాణాల సంఖ్య	కార్డుదారులు
గురజాల	38	21,319
దాచేపల్లి	45	24,754
మాచవరం	37	17,586
పిడుగురాళ్ల	81	3,840
మొత్తం	201	1,02,063

ఇష్టారాజ్యంగా...

ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకోవడం లేదు. దుకాణాల తూకాల్లో మోసం జరుగుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎంటీయూ ఆపరేటర్లు ద్వారా వలంటీర్లు ఇంటింటికి వెళ్లి రేషన్ అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని పలువురు అంటున్నారు.

నిత్యావసరాలు అందజేత

క్రోసూరు: స్థానిక పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. చప్టా దగ్గరి మసీదు వద్ద జిల్లా ముస్లింల సంఘం అధ్యక్షుడు అమీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రోసూరు జెడ్పీటీసీ షేక్ గఫూర్, పలువురు పెద్దలు పాల్గొని సరుకులు అందజేశారు.